క్లుప్తంగా

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: కాశిబుగ్గ సర్కిల్ పరిధిలోని కాశిబుగ్గ ఎరుకల వాడ వాటర్ ట్యాంక్ వద్ద గేట్‌వాల్వ్ మరమ్మతు పనులు కొనసాగుతున్నందున 19, 20వ డివిజన్ల పరిధిలోని పలు కాలనీలకు శనివారం తాగునీటి సరఫరా ఉండదని గ్రేటర్ వరంగల్ డీఈ సారంగం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని వివేకానంద కాలనీ 1, 2, 20వ డివిజన్‌లోని శాంతినగర్, పద్మనగర్, చెరువు కట్ట ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు, రేపు ఘంటసాల పాటల పోటీలు



నయీంనగర్: అమర గాయకుడు ఘంటసాల పాటలతో వరంగల్‌లోని గాయనీ గాయకులతో శని, ఆదివారాల్లో హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లో సంగీత కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు శరత్‌చంద్ర తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాటలు పాడాలనుకునే వారు 90307 41972 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రవికుమార్, సీతారామానుజచార్య, రవికుమార్, నీరజ, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తరలించాలి

మడికొండ: మడికొండలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను అక్కడి నుంచి వేరే చోటుకు తరలించాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డుతో మడికొండ, ధర్మసాగర్, రాంపూర్, తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారని, భూగర్భ జలాలు సైతం కలుషితం అవుతున్నాయని వివరించారు. అలాగే, ధర్మసాగర్ మండలం ఎలుకుర్తిలో ఏర్పాటు చేయనున్న సైనిక్ స్కూల్ నిర్మాణాన్ని ప్రారంభించాలని కోరారు.

మెట్టుగుట్ట వేలం వాయిదా

మడికొండ: మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించాల్సిన వేలంపాటను వాయిదా వేసినట్లు కార్యనిర్వాహణధికారి శేషుభారతి తెలిపారు. కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు, వాహనాల పార్కింగ్‌కు మాత్రమే వేలం పూర్తయినట్లు చెప్పారు. లడ్డు, పులిహోర, కొబ్బరి కాయల విక్రయం, పంచామృతాలు అమ్ముకొనుట, చెరుకు బండి నడుపుకొనేందుకు వేలంలో ఎవరూ పాల్గొనకపోవడంతో ఈనెల 21వ తేదీకి వేలాన్ని వాయిదా వేసినట్లు ఈఓ తెలిపారు.

వృద్ధుడికి ఆదరణ



కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమానగర్ ఆర్వోబీ కింద దర్గాకు వెళ్లే రోడ్డులో ఓ వృద్ధుడు దీనస్థితిలో ఉండడాన్ని డ్యూటీకి వెళ్తున్న సర్వప్రేమ వెల్ఫేర్ సొసైటీ సూపర్‌వైజర్ భాస్కర్‌రెడ్డి చూసి అతనిని ఆదరించారు. అనంతరం, చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించేందుకు 108 సిబ్బందికి సహాయ పడ్డారు.

విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ



మడికొండ: వరంగల్‌కు చెందిన రాజ్‌పుత్ రోహిత్ విజయరాజ్ పింకా వివాహ వార్షికోత్సవం సందర్భంగా మడికొండలోని ప్రాథమిక పాఠశాలలో వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆ దంపతుల కుమారులు అనిల్, రాహుల్, కునాల్.. విద్యార్థులకు శుక్రవారం స్వీట్లు, బిస్కెట్లు, చాక్లెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాంకిషన్ రాజు, బొగ్గవరపు రామకృష్ణ, పాఠశాల హెచ్‌ఎం మల్లారెడ్డి, ఉపాధ్యాయులు కోమల్‌రెడ్డి, మన్నె చంద్రయ్య, రమేష్‌బాబు, వేణుగోపాల్, రాజేశ్వరి, అరుణ, యశోద, కమల, సరిత, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో అధికారులను కలిసిన నాయకులు



వరంగల్ చౌరస్తా: ములుగు రోడ్డులోని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ -327 (టీఎస్ ట్రాన్స్‌కో) వరంగల్ ప్రధాన కార్యాలయంలో సీఈ శ్రీరామ్‌కుమార్, ఎస్ఈ చంద్రశేఖర్, ఎస్ఏఓ అశోక్ కుమార్‌ను జోనల్, రీజినల్, సర్కిల్ నూతన కార్యవర్గాల నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో జోనల్ అధ్యక్షుడు మోహన్, కార్యదర్శి రమేష్, రీజినల్ అధ్యక్షుడు కార్యదర్శి బోనగిరి నాగేష్, పావని, అఖిల తదితరులు ఉన్నారు.

అదాలత్ సెంటర్‌లో నినాదాలు చేస్తున్న ట్రైసిటీ వాహన డ్రైవర్లు, నాయకులు



ఆర్టీసీ వరంగల్ -1 డిపో ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు



కదం తొక్కిన కార్మిక లోకం

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా నగర వ్యాప్తంగా ప్రజా సంఘాలు, రైతుల సంఘాల, వామపక్ష పార్టీల నాయకులు శుక్రవారం రోడ్లపై ధర్నాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైద్య ఆరోగ్య శాఖ కార్మికులు



జీఎంహెచ్ గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు



కాజీపేట చౌరస్తాలో సీపీఎం, ఎస్‌కేఎం నాయకులు



ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు



వరంగల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



నిరసన తెలుపుతున్న న్యూశాయంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు



కేయూలో పరిపాలన భవనం వద్ద ధర్నా చేస్తున్న లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగులు



బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వివిధ కార్మిక సంఘాల నాయకులు

క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలి

కేయూ క్యాంపస్: క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలని, క్రీడల్లో గెలుపోటములు సహజమని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. బీఆర్‌ఎస్ నేత కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం, కాకతీయ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరిగిన కేసీఆర్ క్రికెట్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ పోటీలు ముగిశాయి. ఈమేరకు విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. 47 డివిజన్ జట్టు విజేతగా నిలవగా, 58వ డివిజన్ జట్టు రన్నర్‌గా నిలిచింది. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మైనార్టీ కమిషన్ సభ్యుడు ధర్మన్‌సింగ్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కో ఆర్డినేటర్ పులి రజనీకాంత్, నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న వినయ్‌భాస్కర్

కనీస మద్దతు ధర హామీపై హర్షం



రాహుల్ గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మడికొండ: స్వామినాథ్ సిఫార్సులను అమలు చేసి పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హామీపై పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు కాజీపేట మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు నీలం వేణుయాదవ్ ఆధ్వర్యంలో మడికొండ చౌరస్తాలో రాహుల్ గాంధీ చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం నిర్వహించి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నీలం వేణు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మేలు జరగాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వస్కుల శంకర్, బైరి లింగమూర్తి గౌడ్, బిల్ల రవీందర్, గుర్రం అమర్‌నాథ్, కొప్పుల నవీన్‌యాదవ్, సాయిలు, దువ్వ విజయ్, పల్లపు అర్జున్, గడసు రాజు, సామేలు, వేణు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

‘అజర’లో ఫిజియోథెరపీ, పునరావాస కేంద్రం ప్రారంభం

ఎంజీఎం: అజర ఆస్పత్రిలో ఫిజియోథెరపీ పునరావాస కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించినట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం తెలిపారు. నాణ్యమైన సేవలకు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లకుండా వరంగల్ పట్టణంలోనే మెరుగైన వైద్యసేవలు అందించేలా ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీప్రసాద్, డాక్టర్ శేషుమాధవ్, నాగార్జున రెడ్డి, అన్వర్, శ్రీనివాస్, అప్పాల సుధాకర్, శశికొండ వంశీ తదితరులు పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాళీప్రసాద్

ఘనంగా రథసప్తమి వేడుకలు

కాజీపేట: కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయ ఆవరణలో శుక్రవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాకతో దేవాలయ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. ఆలయంలోని సూర్యభగవానుడి మూలవిరాట్‌కు భక్తులు తెచ్చిన నదీజలాలు, సముద్ర జలాలతో పండితులు అభిషేకాలు జరిపించారు. దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐనవోలు వెంకటేశ్వర్లుశర్మ ఆధ్వర్యంలో సహస్ర నామార్చన, మూలమంత్ర హోమం నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు భక్తులకు అన్నపూర్ణ కేంద్రంలో అన్నదానం చేశారు. సూర్యభగవానుడి రథాన్ని మహిళలు ముగ్గుగా వేసి ఆలయ పరిసరాలను అందంగా తీర్చిదిద్దారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణశర్మ, సాయికృష్ణశర్మ, ఆలయ మేనేజర్ రవి, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, పీఆర్వో మణిదీప్, గంగుల రాజిరెడ్డి పాల్గొన్నారు.

కనులపండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

కాశిబుగ్గ: కాశిబుగ్గలోని రంగనాథస్వామి దేవాలయంలో వేంకటేశ్వర కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు శుక్రవారం రథసప్తమి పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు అలివేలుమంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షులు వంగరి రవి, కార్యదర్శి చిలుపూరి సురేష్, కోశాధికారి సుల్తానా సమ్మక్క, అర్చకులు రామాచార్యులు, భాస్కర్ పాల్గొన్నారు.

భూదేవి, వేంకటేశ్వర స్వామి తిరుకల్యాణం

వరంగల్ అర్బన్: వరంగల్ రామన్నపేట బట్టల బజారులోని వేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర తిరుకల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. సుప్రభాత సేవ, నిత్యారాధన, సేవాకాలం, బాలభోగం నివేదన, శాత్తుముఱై, శాంతిపాఠం, వేద ప్రబంధ విన్నపం, ద్వార తోరణం, ధ్వజకుంభారాధనలు, నిత్యాహవనం, నిత్య పూర్ణాహుతి, బలిహరణ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం, గరుడ సేవ, ఎదుర్కోలు ఉత్సవం, సాయంత్రం కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పారశరం శ్రీనివాసాచార్యులు, ఈఓ ఎలపాటి రత్నాకర్ రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా లక్ష పసుపుకొమ్ముల పూజ

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని సీతారామ చంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో లలితాదేవి అమ్మవారికి లక్ష పసుపుకొమ్ముల పూజను శుక్రవారం నేతపర్వంగా నిర్వహించారు. ఓరుగంటి విమల, సోమ చంద్రకళ ఆధ్వర్యంలో పూజారి శివ రామకృష్ణ చార్యుల నేతృత్వంలో నిర్వహించిన పూజకు మహిళలు పూజా సామగ్రితో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో వ్రతం పూజలు చేశారు. కార్యక్రమంలో మంచాల కృష్ణమూర్తి, రావికంటి అశోక్, శ్రీరాం రాజేష్, మంచాల రాణి, శ్రీదేవి, రాధిక, త్రివేణి, శాంతి, సుప్రజ, సునీత, వసంత, రావికంటి శ్రీదేవి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఈవీఎంల ఎఫ్‌ఎల్‌సీ



వరంగల్ : కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాముల్లో ఈనెల 5న చేపట్టిన ఈవీఎంల మొదటి దశ తనిఖీ శుక్రవారం ముగిసిందని ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. ఈసందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈసీఐఎల్ ఇంజనీర్లు నిర్వహించిన మాక్‌పోలింగ్‌ను కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. మాక్‌పోలింగ్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. 500 ఓట్లకు 20 ఈవీఎంలు, వెయ్యి ఓట్లకు 20 ఈవీఎంలు, 1,200 ఓట్లకు 12 ఈవీఎంలను మాక్‌పోలింగ్‌లో వినియోగించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓట్లు వేయించారు. ఆర్డీఓలు వాసుచంద్ర, రమేష్, ఎన్నికల పర్యవేక్షకులు రమేష్, నాయబ్ తహసీల్దార్లు రంజిత్‌కుమార్, హనీఫ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ.శ్రీనివాస్‌రావు, దాసరి రాజేష్, శ్రీకాంత్, లక్ష్మణ్, యాదగిరి, ఫాయాజ్, అనిల్‌కుమార్, ఈసీఐఎల్ ఇంజనీర్లు, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

అదనపు కలెక్టర్‌గా గట్టు సంధ్యారాణి

కరీమాబాద్ : వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా గట్టు సంధ్యారాణి నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేశారు. ఇటీవల వరంగల్ అదనపు కలెక్టర్‌గా నియమితులైన కె.ఆదిలక్ష్మికి డిప్యూటేషన్‌పై జీహెచ్‌ఎంసీలో పోస్టింగ్ ఇచ్చారు. వెయిటింగ్‌లో ఉన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సంధ్యారాణిని వరంగల్ అదనపు కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్ర పవర్‌లూమ్స్ టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కానుగుల శ్రీనివాస్‌ను జిల్లా రెవెన్యూ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

డీఆర్డీఓ కౌసల్యాదేవికి శుభాకాంక్షలు

వరంగల్: వరంగల్ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ డీఆర్‌డీఓగా బాధ్యతలు స్వీకరించిన కౌసల్యాదేవి, ఇన్‌చార్జ్ అడిషనల్ డీఆర్‌డీఓ మునిగాల దయాకర్‌ను జిల్లా యూనియన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్ (సీసీ)లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సీకేఎంలో ఉచిత వైద్య శిబిరం

వరంగల్: దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శశిధర్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యులు భరత్, శరత్, ప్రవీణ్, అనిల్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ధర్మారెడ్డి, లైబ్రేరియన్ అనిల్, డాక్టర్ మోహన్, కుమార్, కెప్టెన్ డాక్టర్ సతీష్‌కుమార్, రమేష్, రఫీ, ఉదయ, గంగయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

కాశిబుగ్గ: తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీల్లో వరంగల్ జిల్లా బాలబాలికల జట్లు రాణించాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ మహమ్మద్ అబ్దుల్లా ఖాన్ ఆకాంక్షించారు. సూర్యపేట జిల్లా చింతలపాలెంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీలకు వెళ్తున్న జిల్లా బాలబాలికల జట్లకు కబడ్డీ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం దుస్తులు అందజేశారు.

ఆ కళాశాలపై చర్య తీసుకోవాలి

విద్యారణ్యపురి: హనుమకొండలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలకు ఒక బ్రాంచికే అనుమతి తీసుకొని నాలుగైదు బ్రాంచీలు ఏర్పాటు చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్నారని ఏబీఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ విమర్శించారు. ఈమేరకు హనుమకొండ డీఐఈఓ గోపాల్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సాయిబన్నీ, విక్రమ్, వెంకటేష్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

జియాలజీ శాస్త్రవేత్తగా ఆర్ట్స్ కళాశాల విద్యార్థి

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఎస్సీ జియాలజీ చదివిన విద్యార్థి నరేష్.. ఇటీవల నిర్వహించిన యూపీఎస్సీ జాతీయ స్థాయి పరీక్షలో అర్హత సాధించి జియాలజీ శాస్త్రవేత్తగా ఉద్యోగానికి ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య తెలిపారు. ఈ మేరకు కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నరేష్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యనభ్యసించాలి

కాజీపేట: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివినప్పుడే జీవితంలో రాణిస్తారని రిటైర్డ్ కెప్టెన్ గుర్రపు జగదీశ్వర్ రావు (జీజేరావు) అన్నారు. గతేడాది పదవ తరగతిలో అధిక మార్కులు సాధించిన 13మంది విద్యార్థులకు కాజీపేట విద్యానగర్ కాలనీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నగదు పురస్కారాలతో పాటు ప్రశంస పత్రాలను శుక్రవారం అందజేశారు.

ఐకమత్యంతో హక్కులను పరిరక్షించుకోవాలి

వరంగల్: క్రైస్తవ హక్కులను పరిరక్షించుకునేందుకు పాస్టర్లు ఐకమత్యంతో ఉండాలని గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ (పైడిపల్లి, కొత్తపేట, ఆరెపల్లి) పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండపాక పీటర్, ఈసంపల్లి సుదర్శన్ సూచించారు. కొత్తపేట గ్రామంలోని క్రీస్తుదర్శన మందిరంలో శుక్రవారం జరిగిన సమావేశంలో డివిజన్ పరిధిలోని పాస్టర్లు పాల్గొని నూతన కమిటీని ఎన్నుకున్నారు.

బంజారాల చైతన్యానికి సేవాలాల్ కృషి

కేయూ క్యాంపస్: గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ప్రచారం చేస్తూ జంజారుల్లో చైతన్యం కలిగించిన మహావ్యక్తి సంత్ సేవాలాల్ మహారాజ్ అని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య అన్నారు. కళాశాలలో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. తొలుత సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కూరాకుల భారతికి ఎంపీ టికెట్ ఇవ్వాలి

హన్మకొండ: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర మహిళా కన్వీనర్ కూరాకుల భారతికి వరంగల్ పార్లమెంట్ నియోజవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించాలని సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యశబోయిన సాంబయ్య యాదవ్, తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయకుమార్ కోరారు. హనుమకొండ రాంనగర్‌లో ప్రజా సంఘాల సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర మహిళా కన్వీనర్ కూరాకుల భారతి, ప్రజాసంఘాల నాయకులు దొడ్డిపాటి శేఖర్, పైడిపాల వెంకటేశ్వర్లు, సింగారపు రవి, మొకినపల్లి ప్రేమ్‌సాగర్, ఉమాగౌడ్, కనుమల్ల అనిత, ఇనుముల పద్మ, మానస, బుట్టి రంజిత్‌కుమార్, జయంతి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

హన్మకొండ అర్బన్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం పార్టీలోని ప్రతీనాయకుడు, కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, హుజురాబాద్ మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. ఇటీవల బీజేపీలో చేరిన కార్పొరేటర్ అభినవ్ భాస్కర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు.

తప్పిపోయిన యువతి అప్పగింత

రామన్నపేట: మూడున్నర ఏళ్ల క్రితం తప్పిపోయిన మహారాష్ట్రకు చెందిన యువతి పూర్తిస్థాయిలో విచారణ చేసి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు మట్టెవాడ ఏసీపీ కిషన్ శుక్రవారం తెలిపారు. మతిస్థిమితం సరిగాలేని యువతి ఈనెల 11వ తేదీన పోలీస్ స్టేషన్‌కు మదర్ థెరిస్సా ఆశ్రమ నిర్వాహకులు తీసుకురాగా, వివరాలు సేకరించి అప్పగించినట్లు వివరించారు.

మద్యం మత్తులో పెట్రోల్‌తో దాడి

వరంగల్ క్రైం: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్ తులసీ బార్ సమీపంలో ఆటోలో ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి ఆపై ఘర్షణకు దిగారు. ఈక్రమంలో ఒకరు మరొకరిపై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

ఖిలా వరంగల్: బేటీ బచావో.. బేటీ పడావో.. కార్యక్రమంలో భాగంగా జిల్లా సాధికారత కేంద్రానికి చెందిన కోఆర్డినేటర్ పావని ఆధ్వర్యంలో హెచ్‌ఎం శారదాబాయి నేతృత్వంలో శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

హన్మకొండ అర్బన్: రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ డైరీని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ, డిప్యూటీ కలెక్టర్లు వైవీ.గణేష్, ఎల్.రమేష్, శ్రీనివాస్, ఉమారాణి, తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ డైరీ, క్యాలెండర్..

కేయూ క్యాంపస్: కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను కాకతీయ యూనివర్సిటీలో శుక్రవారం ఆవిష్కరించారు.

జాతీయ విద్యావిధానాన్ని రద్దుచేయాలి



విద్యారణ్యపురి: రాస్తారోకో చేస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల బాధ్యులు



రామన్నపేట: ఎంజీఎం జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

విద్యారణ్యపురి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దుచేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదుట రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగాన్ని కేంద్రం ప్రైవేట్, కార్పొరేట్ పెట్టుబడిదారీ వర్గాలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ, ఏఐడీఎస్ఓ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎం జంక్షన్‌లో నిరసన

రామన్నపేట: నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంజీఎం జంక్షన్‌లో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ, ఏఐడీఎస్ఓ నాయకులు నిరసన తెలిపారు. యూజీసీ నిధులను కేంద్రం తగ్గించే ప్రయత్నం మానుకోవాలని సూచించారు. విద్యార్థి సంఘాల నాయకులు ల్యాదల్ల శరత్, ప్రశాంత్, అర్జున్, అరవింద్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతరకు విస్తృత ఏర్పాట్లు చేయండి

వరంగల్ అర్బన్: అమ్మవారిపేట సమ్మక్క–సారలమ్మ జాతరకు విస్తృత ఏర్పాట్లు చేయాలని బల్దియా ఇన్‌చార్జ్ కమిషనర్ రాధిక గుప్తా అధికారులను ఆదేశించారు. ఈనెల 21 నుంచి జరగనున్న జాతర పనుల్ని సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం క్షేత్రస్థాయిలో అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, బల్దియా ఉన్నతాధికారులు, హనుమకొండ జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ కమిషనర్ మాట్లాడుతూ.. భక్తులకు ఇబ్బంది కలుగకుండా 18వ తేదీలోగా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. స్థానిక శాసనసభ్యులు, ఉన్నతాధికారులు, ఆలయ అధికారులు, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులతో సంయుక్తంగా సమావేశం ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ జలగం అనిత, అదనపు కలెక్టర్ మహేందర్ జీ, బల్దియా అదనపు కమిషన్ అనిసుర్ రషీద్, ఆర్డీఓ రమేశ్, సీఎంహెచ్ఓ రాజేశ్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, కాజీపేట తహసీల్దార్ బావుసింగ్, ఈఈ సంజయ్‌కుమార్, డీఈ సంతోశ్‌బాబు పాల్గొన్నారు.



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాధికగుప్తా

పది ఫలితాల్లో జిల్లాను ముందుంచాలి



మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

దేశాయిపేట : పదో తరగతి ఫలితాల్లో జిల్లాను ముందుంచేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషిచేయాలని వరంగల్ డీఈఓ డి.వాసంతి సూచించారు. దేశాయిపేటలోని లక్ష్మి గార్డెన్స్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు సబ్జెక్టులపై అవగాహన పెంచుకుని ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఓరియంటేషన్ కార్యక్రమానికి 65 పాఠశాలల నుంచి 750 మంది విద్యార్థులు హాజరయ్యారు. ట్రస్మా రాష్ట్ర జనరల్ సెక్రటరీ రమేష్‌రావు, అడ్వైజర్ భూపాల్‌రావు, డీసీఈబీ చైర్మన్ కృష్ణమూర్తి, ఎంఈఓ విజయ్‌కుమార్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ సురేష్, నాయకులు వెంకటేశ్వర్లు, పంతుల రామ్మూర్తి, రాధాకృష్ణ, సూర్యనారాయణ, కనకయ్య, రవి, జె.విలియమ్స్, సుధీర్, వై.విద్యాసాగర్, ఎస్.సుధాకర్, జె.సంజీవ, ఖలీల్, నసీరుద్దీన్, మాధవి, అశోక్, రాజేందర్, సమీర్ ఇనాయత్ పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధులకు చికిత్స

కేయూ క్యాంపస్: జీవనశైలి వ్యాధులు, ప్రాణాంతక వ్యాధులకు జీనోమ్‌థెరపీతో పరిష్కారం లభిస్తుందని కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ కిషన్ అన్నారు. కేయూలో జువాలజీ విభాగంలోని సెమినార్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సదస్సులో జీనోమ్‌థెరపీపై ఆయన మాట్లాడారు. ప్రస్తుతం మానవాళి ఎదుర్కొంటున్న క్యాన్సర్, సికిల్‌సెల్ అనీమియా, ఆర్థరైటిస్‌లతోపాటు ప్రాణాంతక వ్యాధుల నివారణకు జీనోమ్‌థెరపీ ఉపయోగపడుతుందని వివరించారు. సమావేశంలో జువాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ షమిత, ప్రొఫెసర్లు డాక్టర్ వెంకయ్య, డాక్టర్ మామిడాల ఇస్తారి, డాక్టర్ సుజాత, డాక్టర్ మధుకర్, డాక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.